



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు





పుష్కరిణిలో చండీశ్వర స్వామికి త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చకులు







వేద శ్రవణం కార్యక్రమంలో వేదపండితులు

మల్లన్నకు త్రిశూల స్నానం

- శాస్త్రోక్తంగా యాగ పూర్ణాహుతి
- నేడు అశ్వవాహనసేవ, పుష్పోత్సవం

శ్రీశైలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో ఏడురోజులపాటు జరిగే మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం యాగపూర్ణాహుతి, త్రిశూలస్నానం వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి అనంతరం యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలుసుగంధద్రవ్యాలు, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. అనంతరం చండీశ్వరస్వామికి ఆలయ పుష్కరిణిలో వైదిక శాస్త్రోక్తంగా అవబృదస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగవల్లి కార్యక్రమంలో సంక్రాంతి పర్వదినాన మల్లన్నను మనువాడిన పార్వతీదేవి అమ్మవారికి మెట్టెలు, నల్లపూసలను సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణ కార్యక్రమాన్ని జరిపారు. దేవస్థానం వేదపండితులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది వేదపండితులు వేదశ్రవణం నిర్వహించారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహిస్తారు. ఆలయ ఉత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం, ఏకాంతసేవ, శయనోత్సవం నిర్వహిస్తారు.



హోమగుండంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు, వేదపండితులు, ఈవో



రహదారి భద్రతా మాసోత్సవాలను జయప్రదం చేయాలి: ఎస్పీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు

నంద్యాల క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జయప్రదం చేయాలని నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల ఏటా చాలా మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచేందుకు రవాణాశాఖ ఈ నెల 16నుంచి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోందని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్‌ను చాలా మంది పాటించడంలేదన్నారు. ద్విచక్రవాహనం నడిపేటపుడు హెల్మెట్, కారు నడిపేటపుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.శ్రీకాంత్, జిటినాయుడు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నంద్యాల రోడ్డు రవాణా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రయాణ సమయంలో చేసే చిన్న పొరపాటు వల్ల మీతోపాటు ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. అందువల్ల తాము విజిబుల్ పోలీసింగ్‌లో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన

- నీలకంఠేశ్వర జాతరలో పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి
- పాలపళ్ల సైజు విభాగంలో..



ఉత్సాహంగా సాగుతున్న ఎద్దు బండ లాగుడు పోటీలు

ఎమ్మిగనూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో వీవర్స్ కాలనీ మైదానంలో గురువారం అంతర్రాష్ట్ర ఒంగోలు ఎద్దుల బండ లాగుడు బలప్రదర్శన పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ జాతర సందర్భంగా రైతు సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధిని పద్మశ్రీ మాచాని సోమప్ప తరువాత తన తండ్రి మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు.

మొదటి రోజు 19 జతల ఎద్దులు: అంతర్రాష్ట్ర ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో కర్నూలు, నంద్యాల, తెలంగాణలోని గద్వాల ప్రాంతాల నుంచి 19 జతల 4 పాలపళ్ల సైజు ఎద్దులు పాల్గొన్నాయి. ఇందులో నందికొట్కూరు తాలుకా అలగనూరుకు చెందిన రోలిమేడమ్ ఎద్దులు నిర్ణీత సమయంలో 5415.5 అడుగుల దూరం బండలాగి మొదటి బహుమతి రూ. 35 వేలు కైవసం చేసుకున్నాయి. అలాగే నందికొట్కూరు నియోజకవర్గం కొణిదేల గ్రామానికి చెందిన దండు రైడర్స్ దండు శకుంతలమ్మ ఎద్దులు 5388.2 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి రూ. 25వేలు సొంతం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నాగేంద్ర, కడప జిల్లా దువ్వూరు మండలం దాసరి పల్లి గ్రామానికి చెందిన దేవరాజు నాయుడు వృషభాలు 5152 అడుగుల దూరాన్నిలాగి మూడో బహుమతి రూ. 15వేలు గెలుచుకున్నాయి.

ఉపాధి పనులు కల్పించండి

- కలెక్టర్ రాజకుమారి
- లేబర్ మొబలైజేషన్‌పై శ్రద్ధ పెట్టండి

నంద్యాల కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతిరోజూ వంద మంది ఉపాధి వేతనదారులకు పనులు కల్పించి నిర్దేశించిన లేబర్ బడ్జెట్ మొబలైజేషన్ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ రాజకుమారి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, సచివాలయ సర్వీసులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్లవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్ మొబలైజేషన్‌కు ఇంకా 16.5 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉందని అన్నారు. ప్రతిరోజు ప్రతి గ్రామపంచాయతీలో వందమంది ఉపాధి వేతనదారులకు పనులు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీఓ, ఏపీడీ, ఎంపీడీఓలను ఆదేశించారు. మంజూరు చేసిన 850 గోకులం షెడ్ల నిర్మాణాలకు గాను 276 మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన పశువుల షెడ్లను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ఇళ్ల నిర్మాణం కింద ఇటీవల నిర్దేశించిన 4,772 గృహ నిర్మాణాల లక్ష్యాన్ని మార్చి 31వతేదీలోగా పూర్తిచేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హౌసింగ్ డీఈ, ఏఈలను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జనార్ధన్‌రావు, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, పశుసంవర్థక అధికారి గోవింద నాయక్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశమైన కలెక్టర్

కంది ధర పతనం

- గరిష్ఠ ధర రూ. 7,500 మాత్రమే
- రెండు నెలలైనా నోరెత్తని మార్క్‌ఫెడ్ అధికారులు
- దోపిడీకి తెర లేపిన వ్యాపారులు

ఈ రైతు పేరు లింగన్న, పత్తికొండ మండలం జూటూరు గ్రామ నివాసి. తనకున్న మూడెకరాల పొలంలో గత ఖరీఫ్‌లో కంది సాగు చేశాడు. వాతావరణ పరిస్థితులు కలిసిరాక ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. 15 క్వింటాళ్ల కందులను అమ్ముకుందామని కర్నూలు మార్కెట్ యార్డుకు రెండు రోజుల కిందట వచ్చాడు. గరిష్ఠ ధర కేవలం రూ.7,500 మాత్రమే పలికింది. మద్దతు ధర కనీసంగా కూడా అందలేదని కన్నీటి పర్యంతం అయ్యాడు. రెండు నెలల కిందట ఇదే మార్కెట్ యార్డులో క్వింటం కందులు రూ.10వేల ధర పలికింది. ఏకంగా రెండున్నర వేలు ధర తగ్గిపోయిందని ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు ఆవేదన చెందుతున్నారు.



కర్నూలు అగ్రికల్చర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 1.80 లక్షల ఎకరాలు, నంద్యాల జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా కర్నూలు జిల్లాలో 70 వేల టన్నులు, నంద్యాల జిల్లాలో 56వేల టన్నుల దిగుబడి వచ్చింది. నవంబరు, డిసెంబరు నెలల్లో బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందులకు రూ.10వేలకు పైగా ధర పలికింది. ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ నుంచి కందులు కొనుగోలు చేయాలని రాష్ట్రంలోని మార్క్‌ఫెడ్ సంస్థకు అనుమతి ఇచ్చింది. కర్నూలు జిల్లాలో 56వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 43వేల మెట్రిక్ టన్నులు కందులు కొంటామని, రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. కర్నూలులో 25 కొనుగోలు కేంద్రాలు, నంద్యాలలో 28 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు రెండు జిల్లాల్లో కలిపి 7లక్షల గోనెసంచులను కూడా సమీకరించేందుకు చర్యలు చేపట్టారు. అయితే.. కనీసం లక్ష గోనెసంచులు కూడా ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో సమకూర్చలేదు. అదిగో ఇదిగో అంటూ మాటలు చెప్పడం తప్ప.. ఇప్పటి దాకా మార్క్‌ఫెడ్ కందుల కొనుగోలు చేపట్టకపోవడంతో వ్యాపారులు ఇదే అదునుగా రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ధరలు కూడా భారీగా తగ్గించేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందుల ధర రూ.7,200 నుంచి రూ.7,800కు తగ్గిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.



ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తేనే కొంటాం

కేంద్ర ప్రభుత్వం క్వింటం కందులకు రూ.7,500 మద్దతు ధరను ప్రకటించింది. అంతకుముందు బహిరంగ మార్కెట్‌లో క్వింటం ధర రూ.10వేలకు పైగానే ఉంది. అదే ధరకు కొనడానికి సిద్ధమయ్యాం. అయితే.. వివిధ కారణాల వల్ల ఇప్పటి దాకా కొనుగోలు చేయలేకపోయాం. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం మద్దతు ధరకు కాస్త అటూ ఇటూగా ధర ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే రైతుల నుంచి కందులు కొంటాం.

- రాజు, మార్క్‌ఫెడ్, కర్నూలు జిల్లా మేనేజర్

పట్టించుకోని మార్క్‌ఫెడ్ అధికారులు

కేంద్ర సంస్థ నాఫెడ్ నుంచి రెండు నెలల క్రితమే కందుల కొనుగోలు చేసేందుకు అనుమతి వచ్చినా రాష్ట్రంలోని మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు మాత్రం రైతుల నుంచి కందులు కొనడానికి సిద్ధం కాలేదు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు క్యూ కడుతున్నారు. ఎప్పుడు కందులు కొనేదీ డీసీఎంఎస్ కేంద్రాల సిబ్బంది చెప్పడం లేదు. రైతుల ఒత్తిడి భరించలేక కేంద్రాలను మూసివేసి పలయానం చిత్తగించే పరిస్థితి నెలకొంది. ఇక మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు మాత్రం సంక్రాంతి లోపలే కొనుగోలు చేస్తామని రైతులను సముదాయించారు. ఇప్పుడేమో సంక్రాంతి తర్వాతనే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది.

వ్యాపారుల దోపిడీ

మార్క్‌ఫెడ్ అధికారులు ఎటూ తేల్చకపోవడంతో మరోదారి లేక పండుగ పూట కుటుంబాన్ని పస్తులతో ఉంచలేక వ్యాపారులు అడిగిన ధరకే రైతులు కందులు అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో క్వింటం కందులు కొనడానికి వ్యాపారులు 4 కేజీల చొప్పున తేమ తరుగు కింద లాక్కుంటున్నారని, వారం తర్వాత డబ్బులు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తూకాల్లో చేతివాటాన్ని ప్రదర్శిస్తూ మోసం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో వ్యాపారులు కమిషన్ ఏజెంట్లు కూడబలుక్కుని తమను దోచేస్తున్నారని, అధికారులు కనీసం ఎలక్ట్రానిక్ కాటాల వద్ద తూకం వేసే సమయంలో కూడా నిఘా పెట్టకుండా ఆఫీసుల్లో ఉండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విహంగ కిలకిలలు..




తుంగభద్ర నదీ తీరం నుంచి ఆహారాన్వేషణకు పక్షుల పయనం

పక్షుల కిలకిలారావాలతో తుంగభద్ర నదీతీరం పులకరిస్తోంది. నిశ్శబ్దంగా ఉన్న నదీతీరం గురువారం సూర్యోదయం వేళ పక్షుల కొత్త రాగాలతో సందడిగా మారింది. గుంపులుగా పక్షులు సొంతగూటి నుంచి ఆహారాన్వేషణకు పయనమయ్యాయి. ఆ సమయంలో మధురమైన పక్షుల కూతలను నగర వాసులు వింటూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు. ఏదిఏమైనా పక్షుల జీవన విధానం మానవులకు సహనాన్ని, శ్రమను, స్వేచ్ఛను నేర్పుతాయి. పక్షుల కదలికలు, జీవన శైలి పర్యావరణ పరిస్థితులపై స్పష్టమైన సంకేతాలు ఇస్తాయి.

- కర్నూలు రూరల్ (ఆంధ్రజ్యోతి).



సూర్యోదయం వేళ గూటిపై పక్షులు



ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కర్నూలు



టెలికాం రంగానికి ప్రభుత్వ సహకారం

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి
- ముగిసిన బీఎస్‌ఎన్‌ఎల్ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న నంద్యాల, కర్నూలు ఎంపీలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు

కర్నూలు న్యూసిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా టెలికాం రంగానికి బీజేపీ ప్రభుత్వం ఎంతో సహకరిస్తున్నదని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కర్నూలు బిజినెస్ ఏరియా టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం (2024-2026)కు సంబంధించి మొదటి సమావేశం గురువారం బీఎస్ఎన్ఎల్ సమావేశ భవనంలో ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ జి. రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిని ఎంపీలు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ శబరి మాట్లాడుతూ నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలో టెలికాం సేవలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధానంగా రోళ్ళపాడులాంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పర్యాటక ప్రాంతంలో మొబైల్ టవర్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌కు, ప్రజలకు మధ్యవర్తిత్వం వహించి టెలికాం సేవలు అభివృద్ధి చేయడానికి అవకాశం లభించిందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కే. రాజేశ్వరరావు, ఐఎఫ్ఏ డి. శ్రీలత, ఏజీఎం ఆపరేషన్ శ్రీనివాసరావు, ఏజీఎం అడ్మిన్ వి. శ్రీనునాయక్, జోన్ ఏజీఎం జి. నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్లమా ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫార్మసీ కళాశాలలో ఖాళీగా ఉన్న డిప్లమా ఫార్మసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ/బైపీసీలో పాసైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. బాల బాలికలకు వేర్వేరు ప్రత్యేక హాస్టళ్లు ఉన్నాయన్నారు. అర్హతగల వారు ఈ నెల 22వ తేదీలోపు అన్ని ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కే. రామకృష్ణయ్య 8074232785, డా. హెచ్‌ఎం సుధీర్ కుమార్ 9963541557 సెల్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

22న రంగోత్సవం పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేంద్రీయ, నవోదయ రెసిడెన్షియల్స్ పాఠశాలల్లో 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 22వ తేదీన తాండ్రపాడు డైట్ కళాశాలలో జిల్లా స్థాయి రంగోత్సవం పోటీలు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ జనార్దన్ రెడ్డి తెలిపారు. విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటోలు ప్రదానం చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల గురించి క్విజ్ పోటీ, డ్రాయింగ్ కాంపిటీషన్ భారత స్వాతంత్ర సమరయోధుల చిత్రాలు, చేతిరాత పోటీలు, రంగోలి పోటీలు, పంజాబీ, ఏపీ ఫోక్ డ్యాన్స్ కంపిటీషన్, డిజిటల్ కొలాజ్, స్లోగన్ రచనలు, రోల్‌ప్లే అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఒక పోటీలో పాల్గొనేవారు మరో పోటీలో పాల్గొనకూడదన్నారు. ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి రంగోత్సవ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

7వ రోజు 229 మంది ఎంపిక



లాంగ్ జంప్ చేస్తున్న దృశ్యం

కర్నూలు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు గురువారం 7వ రోజు కొనసాగాయి. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు ఎస్పీ జి. బిందుమాధవ్ హాజరై పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 320 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫిజకల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 251 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 154 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 225 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 7వ రోజు 229 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీవోఏ ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వీవోఏ లక్ష్మీదేవి తనను విధుల నుంచి తొలగించారన్న సమాచారం తెలిసిన వెంటనే విష ద్రావణం తాగి ఆత్మహత్యయత్నం చేశారు. ఈ సంఘటన గురువారం జరిగింది. వెలుగు కార్యాలయంలో వీవోఏల సమావేశాన్ని గురువారం ఏటీఎం మధు సుదర్శనగౌడు నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి స్వామి గ్రామ సంఘం వీవోఏ లక్ష్మీదేవితో పాటు మరో 29 మందిని ప్రభుత్వం తొలగించిందని ఏపీఎం మధు సుదర్శన్‌గౌడు, వెలుగు సీసీ మహేశ్వరి తెలిపారు. దీంతో లక్ష్మీదేవి వెంటనే బయటికి వెళ్లి విష ద్రావణం తాగి కార్యాలయం ముందు ఆత్మహత్యయత్నానికి పాల్పడి అక్కడే సొమ్మసిల్లి పడిపోయారు. ఇది గమనించిన వీవోఏలు ఆమెను బేతంచెర్ల ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాత్రికేయ రుషి మానుకొండ చలపతిరావు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 16, (ఆంధ్రజ్యోతి): నమ్మిన విలువల కోసం నిరంతర శ్రామికుడిలా విశేష కృషి చేసిన పాత్రికేయ రుషి మానుకొండ చలపతిరావు అని వక్తలు కొనియాడారు. గురువారం టీజీవీ కళాక్షేత్రంలో భారతీయ జర్నలిజం ధృవతార మానుకొండ చలపతిరావు అనే పుస్తకాన్ని సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కుడా చైర్మన్ సొమిశెట్టి వెంకటేశ్వర్లు, సాహితీవేత్త చంద్రశేఖర్ కల్కూర అవిష్కరించారు. ఈ సందర్భంగా ది ఫెడరల్ ఆంగ్ల పత్రిక సంపాదకుడు జింకా నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో జర్నలిస్టుగా రాణించి, అధికారం, పదవులు ఎంతో దగ్గరగా వచ్చినా వాటి నీడను సైతం తన మీద పడకుండా జాగ్రత్తపడ్డ గొప్ప వ్యక్తి మానుకొండ చలపతిరావు అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని సైతం సున్నితంగా తిరస్కరించిన మహనీయుడు ఆయన అని గుర్తు చేశారు. పుస్తక రచయిత ఆకుల అమరయ్య మాట్లాడుతూ పాత్రికేయంలో మొదటి తరాన్ని ముందుండి నడిపించిన మానుకొండ చలపతిరావు వర్తమాన పాత్రికేయులకు దిక్సూచి, ఆదర్శనీయుడని కీర్తించారు. ఆయన కృషి వల్లనే ప్రాతికే య రంగంలో సంస్కరణలు జరిగి, 1955 చట్టం, వేతన బోర్డుల ఏ ర్పాటు జరిగిందన్నారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మా ట్లాడుతూ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని, పాతతరం లో విలువలు కల్గిన పాత్రికేయులు నేటికీ స్ఫూ ర్తిగా నిలుస్తారని చెప్పారు. చంద్రశేఖర్ కల్కూర మాట్లాడు తూ వ్యక్తిగత సమస్యలు, సంక్షేమం తప్ప, వ్యక్తిగత ప్రయోజనాలు కోరుకోని నిస్వార్థ సేవకుడు మానుకొండ చలపతిరావు అని తెలిపారు.



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న అతిథులు

వాహనం దూసుకెళ్లి మహిళకు తీవ్ర గాయాలు

జీపు వదిలేసి పరారైన యువకుడు

నంద్యాల క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీసీ కాలనీలో ఓ మహిళ తన ఇంటిముందు మెట్లపై కూర్చొని ఉండగా ఓ వాహనం ఆమెపై నుంచి దూసుకె ళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఒక యువకుడు బొలెరో వాహనాన్ని డ్రైవింగ్ చేసినట్లు తెలుస్తోంది. మహిళను ఢీకొట్టిన అనంతరం సదరు యువకుడు వాహనాన్ని ప్రమాద స్థలంలోనే వదిలి పరారైనట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుశీలమ్మను స్థానికులు హుటాహుటిన నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం వైద్యులు కర్నూలుకు తరలించినట్లు సమాచారం. కాగా ప్రమాదానికి కారణమై పరారైన యువకుడి కోసం గాలిస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం.. ఒకరి మృతి

నంద్యాల క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం కానాల గ్రామం వద్ద గురువారం మోటార్‌సైకిల్ చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్ఐ గంగయ్య తెలిపిన వివరాలివీ.. గోస్పాడు మండలం చింతకుంట గ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి అనే వ్యక్తి పనిమీద ద్విచక్ర వాహనంపై నంద్యాలకు వస్తుండగా కానాల గ్రామం వద్దకు రాగానే లో బీపీ కారణంగా స్పృహ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న చెట్టుకు బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన స్థానికులు వెంటనే ఆయనను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెరుగుతున్న సైబర్ మోసాలు ..

- నష్టపోతున్న అమాయక ప్రజలు
- తాజాగా తిమ్మనాయినిపేటలో ఘటన

కొలిమిగుండ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన సైబర్ మోసాలు నేడు గ్రామీణ ప్రాంతాలకు ఎగబాకాయి. గ్రామాల్లో అమాయక ప్రజలే లక్ష్యంగా మోసగాళ్లు సైబర్ క్రైమ్‌కు పాల్పడుతున్నారు. గ్రామాల్లో వివిధ రకాల నగదు చెల్లింపు యాప్‌లు, బ్యాంకు లావాదేవీల్లో వివిధ వర్గాల వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని, వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా సంప్రదిస్తారు. వారిని మాటల్లో పెట్టి క్షణాల్లో వారి ఖాతాల్లోని నగదును లాగేస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలోనే కొలిమిగుండ్ల మండలంలో 10మంది వరకు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని నగదు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా తిమ్మనాయినిపేటకు చెందిన ఓ వ్యక్తి గుర్తు తెలియని వీడియో కాల్ రిసీవ్ చేసి తన ఖాతాలోని రూ.33 వేలు నష్టపోయి లబోదిబోమంటున్నాడు. సైబర్ క్రైమ్ విభాగానికి అన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. గత కొన్ని రోజుల క్రితం కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల గ్రామాల్లో సైతం ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి

- అడ్డుకోబోయిన తండ్రిపై కూడా..
- ఆరుగురిపై కేసు

మహానంది, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మసీదుపురంలో బుధవారం అర్ధరాత్రి మద్యం మత్తులో వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డితో పాటు ఐదుగురు వైసీపీ నాయకులు అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తలారి శివపై దాడి చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి మద్యం మత్తులో అతనితో పాటు లింగారెడ్డి, నాగమల్లీశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఫణీంద్రా రెడ్డి వడ్డే పల్లపు మల్లికార్జున ఇంటి సమీపంలోని శివ ఇంటిపై దాడి చేసి ఘర్షణ పడ్డారు. అంతేకాక దాడిని అడ్డుకోబోయిన శివ తండ్రి చిన్న పెద్దన్నపై కూడా దాడి చేసి గాయపర్చినట్లు చెప్పారు. విషయం తెలుసుకొన్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి బాధితులను పరామర్శించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు

ఉప్పర్లపల్లిలో రాతిదూలం పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న టీడీపీ తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మౌలాలి స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాతిదూలం పోటీలు పోటాపోటీగా జరిగాయి. గురువారం తుగ్గలి మండల పరిధిలోని ఉప్పర్లపల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు రాతిదూలం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలా గ్రామీణ పోటీలు, రాతి దూలం పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ పోటీలకు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి నుంచి వరుసగా 5 బహుమతులు రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలతో పాటు మరో మూడు బహుమతులను దాతలు అందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అప్పా వేణుగోపాల్, వెంకటస్వామి, శ్రీనివాసులుగౌడు, జగన్మోహన్, పోస్టు వెంకటేశ్, ప్రసాద్, విశ్వనాథ్, సుధాకర్‌రెడ్డి, కంబగిరి, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

పాలస్తీనా ప్రజలకు అండగా ఉందాం

కర్నూలు (కల్చరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా- ఇజ్రాయిల్ యుద్ధాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంగా చూడకూడదని ప్రపంచంలో జరుగుతున్న సామ్రాజ్యవాదానికి ప్రతిబింబంగా చూడాలని, ఈ నేపథ్యంలో పాలస్తీనా ప్రజలకు అండగా మేధావులు, కవులు, కళాకారులు గళం విప్పాలని వక్తలు పిలుపు నిచ్చారు. గురువారం ఉదయం నగరంలోని బావర్చి ఫంక్షన్ హాల్‌లో కవి చౌశా రచించిన 'బిసాన్ ఓవ్ డా' పుస్తకాన్ని ఆర్థిక శాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు డా. మన్సూర్ రెహి మాన్ ఆవిష్కరించారు. నంది అవార్డు గ్రహీత మహ్మద్ మియా సభ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పుస్తకాన్ని కథా రచయిత ఇనయతుల్లా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఒక చిన్న దేశంపై సామ్రాజ్యవాద దేశాలన్నీ కలిసి యుద్ధం చేస్తూ పసిపిల్లల్ని, మహిళలను చంపుతూ ఆ దేశాన్ని నెత్తుటి మయం చేశాయని అన్నారు. ఈ దారుణా లను కవి చౌశా గొప్ప కవిత్వంగా రాశాడన్నారు. బిసాన్ ఓవ్ డా పాలస్తీనాలో జర్నలిస్టుగా పని చేస్తూ యుద్ధాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారని, ఆమె వల్లనే ఆ దేశంలో జరుగుతున్న స్థితిగతులన్నీ మనకు తెలుస్తున్నాయని అన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ మన దేశంలో మతోన్మాదులు పెట్రేగిపోతున్నారని, మతోన్మాదం బలమైన ఆయుధంగా మార్చుకొని పాలిస్తున్నారని అన్నా రు. లౌకిక సమాజాన్ని అందరం కలిసి నిర్మించాల్సిన అవ సరం ఉందన్నారు. ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాలుతూ కవి చౌశా ఇప్పటి వరకు తన రాసిన రచనలన్నీ వర్తమాన ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలే అన్నారు. ఆవాజ్ నాయకుడు ఇక్బాల్ మాట్లాడుతూ ఈ దేశంలో మతోన్మాద శక్తుల ఆటలు సాగవనే సందేశాన్ని భారత పాలకులకు ఇవ్వాలని అన్నారు. మహాప్రస్థానం మరో ప్రస్థానం సమూహం నిర్వహణలో జరిగిన ఈ సభను కవి కెంగార మోహన్ ప్రారంభించగా.. తొలి ప్రతులను కోడుమూరు ఆవాజ్ నాయకులు ముస్తఫా, యూసుఫ్ అందుకున్నారు.

పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

జాతరలో దొంగల హల్‌చల్

- ఒక ఇన్నోవా కారు అపహరణ
- బంగారు గొలుసులు లాకెళ్లిన దొంగలు



అపహరణకు గురైన కారు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు జాతరలో దొంగలు హల్‌చల్ చేశారు. జాతర చూసేందుకు వచ్చిన భక్తులను లక్ష్యంగా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. పలువురి మెడలో ఉన్న బంగారు గొలుసులను లాకెళ్లారు. బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బుధవారం సాయంత్రం ఎమ్మిగనూరు నీలకంఠేశ్వరస్వామి రథోత్సవం జరిగింది. దాదాపు 1.50 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. రథం జరిగే సమయంలో పలువురు భక్తులు రథాన్ని లాగుతుండగా.. మిగిలిన భక్తులు భక్తితన్మయత్వంతో హరోం హర హర అంటూ ఆధ్యాత్మికతలో మునిగిపోయారు. ఆ సమయంలో భక్తుల్లో కలిసిపోయిన కొందరు దొంగలు మెడలో బంగారు చైన్లను తస్కరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. రథోత్సవాన్ని చూసేందుకు తెలంగాణ నుంచి వచ్చిన భక్తుడు తన ఇన్నోవా క్రిస్టా కారు(టీఎస్ 09 ఎఫ్‌యూ 2367) కారు తాళాలు రద్దీలో పోగొట్టుకున్నాడు. ఈ విషయం మైక్‌లో ప్రకటించారు. వచ్చి చూసే సరికి కారు కనిపించకపోవటంతో భక్తుడు ఖంగుతిన్నాడు. అలాగే ఓ వ్యాపారి మెడలో 3 తులాల బంగారు చైన్ లాకెళ్లారు. మరో ప్రైవేటు ఉద్యోగి 15 గ్రాముల బంగారు చైన్ కూడా దొంగిలించారు. ఇలా దాదాపు 12 మంది భక్తుల బంగారు చైన్లను తస్కరించారు. ఈ విషయాన్ని ఎమ్మిగనూరు టౌన్ సీఐ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా.. ఒక ఇన్నోవా కారు దొంగలించారని, మరో నలుగురు వ్యక్తులు మాత్రమే తమ మెడలో బంగారు చైన్లు పోయినట్లు ఫిర్యాదులు ఇచ్చారని అన్నారు. ఈ దొంగతనాలపై సమగ్రంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

పాణ్యం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిధులు అందించకపోవడంతో ఎస్సార్బీసీ కాలువలు శిథిలావస్థకు చేరాయి. కొండ జూటూరు సమీపంలో పంట కాలువల్లో చెత్తాచెదారం, జమ్ము ఏపుగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారడంతో కింది భూముల పంటలకు నీరు అందక రైతులు మూడు రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే కాలువలోని ఎస్సార్బీసీ నీరు కాలువలు ఎక్కి పంటచేలలో పారుతుండడంతో బ్లాక్1 గేటు మూసివేశారు. దీంతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. కింది గ్రామాలకు నీరందకపోవడంతో తొగర్చేడు రైతులు నేరుగా సొంత నిధులతో పాటు స్వయం కృషితో పనులు చేపట్టారు. కాలువల్లో నీరు ప్రవహించకపోవడంతో సొంత నిధులు ఖర్చు చేసి ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేసుకొని పనులు చేపట్టారు. దీంతో బుధవారం నీరు అందినట్లు రైతులు పేర్కొన్నారు. ఎస్సార్బీసీ కాడా డివిజన్ ఈఈ కిష్టప్ప మాట్లాడుతూ బ్లాక్ 1 పంట కాలువలో చెత్తాచెదారం చేరి నీరు పారకపోవడంతో రైతులే సొంతంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేసుకున్నారని చెప్పారు. కాలువల్లో నీరు ఉండడంతో జంగిల్ క్లియరెన్స్‌కు ప్రతిపాదనలు తయారు చేయలేదన్నారు. నీరుతగ్గిన తర్వాత ప్రతిపాదనలు చేపడతామన్నారు. నిధులు లేకపోవడంతో పనులు చేపట్టలేదన్నారు.


ఎస్సార్బీసీ కాలువలో పెరిగిన గడ్డి

బాధితులకు చెక్కుల పంపిణీ

పగిడ్యాల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన చిలకల శ్రీదేవికి రూ.50 వేలు, శివలక్ష్మమ్మకు రూ.37 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గురువారం బాధితులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడేవారు సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకున్న వెంటనే వారికి నిధులు మంజూరవుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగేశులు, బాలీశ్వరుగౌడ్, రమణ తదితరులు ఉన్నారు.

పింఛన్లపై ఆరా


పింఛన్‌దారుడిని పరీక్షిస్తున్న వైద్యులు

గోస్పాడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద రూ.15 వేలు తీసుకుంటున్న వారిని విచారించినట్లు ఎంపీడీవో హామానుల్లా తెలిపారు. మండలంలో మొత్తం 19 మంది రూ.15 వేల పింఛన్ తీసుకుంటున్నారని తెలిపారు. యాళ్ళూరులో ఏడుగురు, జిల్లెల్లలో నలుగురు, కానాలపల్లెలో ముగ్గురు, గోస్పాడు, దీబగుంట్ల, పుసురుపాడు, జూలేపల్లి, ఎంకృష్ణాపురం గ్రామాలలో ఒక్కొక్కరు చొప్పున పింఛన్ తీసుకుంటున్నారు. వీరిని అనంతపురం జిల్లా నుంచి వచ్చిన డాక్టర్లు మోహన్‌నాయక్, రాజశేఖర్, స్వరూప్ మండలంలో పనిచేస్తున్న మెడికల్ అధికారులు వారిని వారి ఆరోగ్యాన్ని పరీక్షించారు. మొత్తం 19 మందిలో గోస్పాడు గ్రామానికి చెందిన వ్యక్తి నంద్యాల ప్రభుత్వ హాస్పిటల్‌లో ఐసీయూలో ఉండడం వల్ల పరీక్షించలేదని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: ఆర్డీవో


సూచనలు ఇస్తున్న ఆర్డీవో విశ్వనాథ్

నంద్యాల రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆర్డీవో చల్లా విశ్వనాథ్ సూచించారు. గురువారం నంద్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కానాల గ్రామంలో చేపట్టిన భూ రీ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. అలాగే 167 కే జాతీయ రహదారి అంశాలపై సిబ్బంది నుంచి సమాచారం తెలుసుకున్నారు. జాతీయ రహదారి భూ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. చుక్కల భూములు, ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన రెవెన్యూ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలు మెచ్చేలాగా నిర్వహించాల్సిన అంశాల గురించి అధికారులకు వివరించారు. నంద్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్లు ప్రియదర్శిని, పత్తి శ్రీనివాసులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీవో విశ్వనాథ్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్జిదారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో వెళ్లి భూ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. తహసీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'వడ్డెరల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి'

నంద్యాల రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వడ్డెరల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ కోరారు. గురువారం నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలన్నారు. వడ్డెరలపై నేటికి దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అండగా నిలిచామని, ప్రభుత్వం గుర్తించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

'పట్టణంలోనే కొనసాగించాలి'

ఆత్మకూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి అందుబాటులోనే విద్యుత్ వినియోగదారుల కేంద్రాన్ని కొనసాగించాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, వీరన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు బిల్లుల చెల్లింపునకు సంబంధించి పట్టణంలోనే వినియోగదారుల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే ఇటీవల ఈ కేంద్రాన్ని పట్టణ శివార్లలోని రెండు కిమీల దూరంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయానికి మార్చడం వల్ల వినియోగదారులకు ప్రయాసగా మారిందని అన్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో వుంచుకుని విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని పట్టణంలోనే ప్రజలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'రాజకీయంగా ఎదగాలి'


కురువ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గడివేముల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కురువలు ఉన్నత చదువులు చదివి సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని కురవ సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శులు రంగస్వామి, పాపారాయుడులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కురువ కులస్థులు గతంలో సంచార జీవితం గడిపేవారని అన్నారు. ప్రస్తుతం యువతీ యువకులు చదువుకు ప్రాధాన్యత ఇచ్చి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని అన్నారు. టీడీపీ కురువలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. అనంతరం వారు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీశైలం కురవ సత్రం కోశాధికారి వెంకటేశ్వర్లు, బాల తిమ్మయ్య, శ్రీనివాసులు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్



నంద్యాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నందికొట్కూరులో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్ రావు

నంద్యాల కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాలలో వాహన చోదకులను భాగస్వాములు చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, వాహనచోదకులు, ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు సంబంధిం చిన బ్లాక్ స్పాట్స్ గుర్తించి క్లియర్ చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడంపై, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించి వాటికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ వివరించారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చునని ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ వినయ్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపోలోని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం అక్కడికి వచ్చిన డ్రైవర్లతో రోడ్డు నియమాలు పాటించి ప్రమాదాలను నివారిస్తామని పేర్కొంటూ ప్రతిజ్ఞ చేయించారు.



ఆత్మకూరులో..

నందికొట్కూరు(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనల పట్ల ప్రయాణికులు అవగాహన కలిగి ఉండాలని నందికొట్కూరు పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్‌రావు సూచించారు. పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రారంభమైన రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రయాణికులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, నిబంధనల ప్రకారం నిర్దేశిత వేగంలోనే వాహనాలు నడపాలని ఆయన సూచించారు. ప్రయాణికులు, ఇటు డ్రైవర్లు రోడ్డుపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ డిపో ట్రాఫిక్ సీఐ సరోజినమ్మ, ఏఎంఎఫ్ ప్రమిళ, యూనియన్ జాయింట్ సెక్రటరీ విజయుడు, నాయకులు స్వామి పాల్గొన్నారు.

ముగిసిన తాండవ మల్లేశ్వరస్వామి ఉత్సవాలు

కొత్తపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఈ నెల 13 నుంచి జరిగిన తాండవ మల్లేశ్వరస్వామి ఉత్సవాలు 16వ తేదీ గురువారం సాయంత్రంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు జరిగిన పారువేట ఉత్సవాలకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు. ముందుగా వారు తాండవ మల్లేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లగా.. ఆలయ పురోహితులు, ఆలయ కమిటీ, స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం తాండవ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం

తాండవ మల్లేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని గత రెండు రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరుగుతున్న ఉమ్మడి జిల్లాల కబడ్డీ పోటీలలో విజేతలకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి విజేత కొత్తపల్లి మస్తాన్ టీమ్‌కు మాండ్ర శివానందరెడ్డి రూ.15వేలు అందజేశారు. రెండో విజేతగా ఆత్మకూరు హనుమాన్ టీమ్‌కు రూ.10 వేలు రాజరాజేశ్వరి హై స్కూల్ కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి, మూడో విజేత కొత్తపల్లి మస్తాన్ టీమ్-బికి గూడెం నడిపెన్న రూ.5 వేలు, నాలుగో విజేత ఓంకార్ టీమ్‌కు గాండ్ల ప్రసాద్ రూ.3వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, నాగేశ్వరరావు యాదవ్, నారపురెడ్డి, లింగస్వామి గౌడు, మోహన్ యాదవ్, అమర్నాథ్, నడిపెన్న తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవమూర్తులకు పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు


దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

తెలుగు మీడియం కొనసాగించాలి: ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించా లని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి కోరారు. గురువారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగిస్తూనే సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. గత ప్రభుత్వ దుశ్చర్యలను నివారించి విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో చదివే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, భాస్కర్‌రెడ్డి, జాకీర్‌హుసేన్, వెంకటరామిరెడ్డి, మల్లేశ్వర్, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ 1938జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని డీఈవో కార్యాలయంలో డీఈవో జనార్ధన్‌రెడ్డిని ఏపీటీఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు.

మూడో పట్టణ సీఐగా కంబగిరి రాముడు



నంద్యాల క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మూడో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కంబగిరి రాముడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ ఇటీవలే సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల మూడవ పట్టణ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన కంబగిరి రాముడును పోలీస్ స్టేషన్‌లోని ఎస్ఐలు, సిబ్బందితో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వచ్ఛ శ్రీశైలం


పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం



ర్యాలీలో పాల్గొన్న ఈవో, సిబ్బంది

శ్రీశైలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో గురువారం స్వచ్ఛసేవా కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహించింది. కార్యక్రమంలో ప్రధాన ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపము వద్ద నుంచి నందిగుడి వరకు "స్వచ్ఛశ్రీశైలం" పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణకై క్షేత్రపరిధిని 6 జోన్లు, 66 ప్రదేశాలుగా విభజించి, ప్రతి జోను పర్యవేక్షణకై దేవస్థానం యూనిట్ అధికారులు, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. కార్యక్రమంలో దేవస్థానం అన్ని విభాగాల సిబ్బంది, శివసేవకులు, స్థానికులను భాగస్వామ్యులను చేశారు. ఆలయ ప్రధాన రహదారులు, ఆలయ మాడవీధులు, క్యూకాంప్లెక్స్, అన్నదానం, వసతి భవనాలు, పార్కింగ్ ప్రదేశాలు, పాతాళగంగ ఘాట్, ఆరోగ్యకేంద్రాలు, సాక్షిగణపతి, హఠకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయ ప్రాంగణం, తదితర 66 ప్రదేశాలలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పగిడ్యాల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా పడమర ప్రాతకోట గ్రామంలోని కాశీవిశ్వేశ్వర, నందీశ్వర స్వామి తిరుణాల సందర్భంగా గురువారం అంతర్ రాష్ట్రస్థాయి పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలవగా, వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన కె.రమేష్ నాయుడు ఎద్దులు రెండు, డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన షేక్ మైహిమున్నా ఎద్దులు మూడో స్థానంలో గెలుపొందాయి. నంద్యాల మండలం బల్లాలపురం గ్రామానికి చెందిన కొలిమి యోగేశ్వర్ ఎద్దులు 4వ స్థానంలో గెలుపొందాయి. నగదును గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ. 40వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలీశ్వర్‌గౌడ్, శ్రీనివాసులు నాయుడు, వెంకటేశ్వర్లు, నాగేశులు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● పడమర ప్రాతకోట గ్రామంలో నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభించేందుకు వచ్చిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మాండ్ర సురేంద్రనాద్‌రెడ్డి, ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డిలను ఆలయ కమిటి నిర్వాహకులు పూలమాల, శాలువ కప్పి సన్మానించారు.

'సమస్యలు పరిష్కరించాలి'

పాములపాడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): టెలికాం రంగంలో నెలకొన్న సమసల్యను పరిష్కరించాలని టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు, టీడీపీ నాయకుడు రమేష్ కోరారు. కర్నూలు పట్టణంలో గురువారం నిర్వహించిన బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కర్నూలు ఎంపీ గురు నాగరాజును కోరారు. రమేష్ మాట్లాడుతూ పాములపాడు, మిడుతూరు, కొత్తపల్లి, జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క సమస్యలు ఉన్నాయని, దీంతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ టెక్నికల్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలిషికారి కాలనీలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు, 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జఫ్రూల్లా తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది కుమారి, శంకర్ నాయక్, పద్మనాభం, మధుసూదన్, ప్రసాద్, సుధీర్, కుమార్ పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు


కారు కింద ధ్వంసమైన బైకు

మహానంది, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అల్లీనగరం గ్రామం వద్ద కారు అదుపు తప్పి రహదారి ప్రక్కనే నిలిపి ఉన్న మోటర్ బైక్‌ను ఢీ కొట్టింది. అక్కడ ఎవ్వరు లేక పోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన కారులో భక్తులు దైవదర్శనం కోసం మహానందికి వెళ్తున్నారు. మార్గమధ్యంలోని అల్లీనగరం వద్దకు కారు అదుపుతప్పి రహదారి పక్కన నిలిపి ఉన్న మండలంలోని గాజులపల్లికి చెందిన ఉసేన్‌బాషా బైకును ఢీకొట్టింది. బెకు పూర్తిగా ధ్వసం అయ్యింది. ఈ విషయంపై మహానంది పోలీసులను వివరణ కోరగా కారు ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

'మామిడి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి'

పాణ్యం, జనవరి16 (ఆంధ్రజ్యోతి): మామిడి పంట సాగులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి దివ్య సూచించారు. గురువారం ఆమె పాణ్యంలోని మామిడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి తోటలు పూత దశలోకి మారుతున్న దశలో రైతులు 10 శాతం పూతలేని తోటల్లో తేలికపాటి తడి ఇచ్చి 13 : 0 : 45 ను పది గ్రాముల సూక్ష్మ ధాతు మిశ్రమాన్ని 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. 25 శాతం పూత దశలో ఉన్న తోటల్లో ఒక తడి ఇచ్చి బ్రాసినోలిడ్ ఒక మిల్లీ లీటరు ఇమిడాక్లో మిన్ 0. 5 మిల్లీ లీటరు హెక్సాకొనజోల్ మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 50 శాతం పూత వచ్చిన తోటల్లో ప్లానోఫిక్స్ 0జ 3 మిల్లీలీటర్లు థియోమిథాక్సాయ్ 0.3 మిల్లీలీటర్లు ఒక లీటనే నీటికి కలిపి పిచికారి చేయలని సూచించారు. 75 నుంచి 100 శాతం పూత దశ, 10 శాతం పిందె ఉన్న తోటల్లో స్పైనోసాడ్ 0.3 మిల్లీలీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పండు రంగు నివారణకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. పండు ఈగను నివారించడానికి బుట్టలు, టాబ్లెట్లు, జెల్ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గతనెలలో మృతిచెందిన నంద్యాలకు చెందిన హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ కుటుంబానికి గురువారం ఆర్థిక సాయం అందించారు. మూడు రోజుల పోలీసు శిక్షణ నిమిత్తం గతనెలలో మధుసూదన్ తిరుపతికి వచ్చాడు. శిక్షణ ముగించుకుని నంద్యాలకు వెళ్లడానికి 20వ తేదీన తిరుపతి ఆర్టీసీ బస్టాండుకు వచ్చాడు. బస్సు ఎక్కే క్రమంలో కాలు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. అప్పటి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ పోలీసు శాలరీ కింద దరఖాస్తు చేయించారు. పోలీసు అధికారుల యూనియన్ సంఘం అధ్యక్షుడు సోమశేఖర రెడ్డి కృషి మేరకు ఆ కుటుంబానికి గురువారం రూ.75 లక్షలు అందజేశారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కుట్రదారులను కఠినంగా శిక్షించాలి

- డోన్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ
- డీఎస్పీకి వినతి పత్రం అందజేత



డోన్ డీఎస్పీ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

డోన్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట్రికే హరికిషన్‌పై హత్యాయత్నం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పాతబస్టాండు నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ వైస్ చైర్మన్‌ను హత్య చేసేందుకు ఉద్దేశ పూర్వకంగానే కారుతో ఢీకొట్టినట్లు స్పష్టమవుతుందన్నారు. హత్య చేయాలనే కుట్రలో ఎంతటి పెద్దవారున్నా సమగ్ర విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు , ప్రముఖులు రంగయ్య, కోట్రికే ఫణిరాజు, సీఎం శ్రీనివాసులు, జొన్నలగడ్డ శ్రీను, రంజిత్ కిరణ్ జనార్దన్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌న విడుదల చేస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్

డోన్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో గురువారం జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు రహదారి భద్రత మహోత్సవాల పోస్టర్‌ను ఆర్టీవో క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ వచ్చే నెల 15వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ టీయూ నాయకులు శివరాం, మద్దయ్య, ఆటో యూనియన్ నాయకులు అన్వర్, ట్రాక్టర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి: సీఐ

కోవెలకుంట్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్‌పెక్టరు హనుమంత నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డీఎం తిరుపతయ్య ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వచ్చే నెల 15వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో శివారెడ్డి

చాగలమర్రి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని డీఎల్‌డీవో శివారెడ్డి తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని 3, 4 సచివాలయాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి విధులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. మండల కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఇంజరింగ్, వెల్ఫేర్, ఉపాధిహామీ ఉద్యోగులచే సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీవో మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, ఎంపీసీ, ఎన్ఆర్‌ఐ, ఎంఎస్ఎంఈ సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహిర్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో రైతులకు మంచి రోజులు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో మండల వ్యవసాయశాఖ నిర్వహించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, పంట మార్పిడి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు తదితర అంశాలపై ఏవో భూమా జ్యోతి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, గ్రామ సర్పంచ్ శివశంకర్, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్ణ, రామిరెడ్డి, ఎంపీటీసీ పెద్దన్న రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన కోసం రామ్‌కో కృషి

కొలిమిగుండ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నిర్మూలన కోసం రామ్‌కో సిమెంట్ పరిశ్రమ తన వంతు ప్రయత్నం చేస్తోందని రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, మైన్స్ జీఎం అజ్మల్ అహ్మద్ అన్నారు. గురువారం కొలిమిగుండ్లలో ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారి ఆదేశాల మేరకు ఉచిత క్షయ వ్యాధి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 150మందికి చికిత్సలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎం జియాలజీ నాయుడు, డాక్టర్ శశిధర్, సంస్థ సిబ్బంది ప్రతాప్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడును ఎమ్మెల్యే అఖిలప్రియ, టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి గురువారం కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిధుల విడుదల తదితర వాటిపై సీఎంతో చర్చించారు.



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

బిల్లుల దందా..!

- మూలపడిన ఎండీయూ వాహనాలు
- ప్రతి నెల వాహన ఆపరేటర్లకు బిల్లుల చెల్లింపులు
- రూ లక్షల ప్రజాధనం దుర్వినియోగం
- నిద్రావస్థలో అధికారులు

ప్యాపిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి రేషన్ సరుకులు సరఫరా చేయాలని గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కార్యక్రమం ఆదిలోనే అభాసుపాలైంది. ప్రారంభంలో ఆరునెలల పాటు అక్కడక్కడ మొక్కుబడిగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌ను పంపిణీ చేసినా.. అనంతరం వాహనాలు మూలపడ్డాయి. మూలన పడిన ఎండీయూ వాహనాల ఆపరేటర్లకు ప్రతి నెల అధికారులు రూ.లక్షల బిల్లులు అప్పనంగా అందజేస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి.

మండలంలో 54 రేషన్ దుకాణాలు ఉన్నాయి. రేషన్‌ను ఇంటింటికి అందజేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 14 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. అయితే ఏనాడు వాహనాలు రేషన్ పంపిణీ చేయలేదు. ప్రస్తుతం ఆ వాహనాలు మూలన పడ్డాయి. అయిన అధికారులు వాహనాలకు బిల్లులు చెల్లించి నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రతినెల రూ.మూడు లక్షల బిల్లులు చెల్లింపు

మండలంలో 14 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఒక్కో వాహ నం ఆపరేటర్‌కు ప్రతి నెల రూ.18వేలు వేతనం చెల్లిస్తున్నారు. డీజల్, ఇతర నిర్వహణ ఖర్చుల కింద అదనంగా మరో రూ.3వేలు చెల్లిస్తుండటం విశేషం. అంటే ప్రతినెల ఒక్కో ఎండీయూ వాహనానికి రూ.23వేల బిల్లులను అధికారుల అప్పనంగా అందజేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ లెక్కన నెలనెల మండలంలో ఎండీయూ వాహనాల ఆపరేటర్ల ఖాతాలకు దాదాపు రూ.3లక్షలు బిల్లులు జమవుతు న్నట్లు తెలుస్తుంది.



మూలకు నిలిపివేసిన ఎండీయూ వాహనాలు

ఎండీయూ వాహనాల పనితీరుపై విచారణ చేస్తాం

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలని ఆపరేటర్లకు ఆదేశాలు ఇచ్చాం. ఆదేశాల ప్రకారం రేషన్ ఇంటి దగ్గరనే పంపిణీ చేస్తున్నట్లు సమాచారం ఉంది. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. అయిన ఎండీయూ వాహనాల తీరుపై విచారణ చేసి రేషన్‌ను ఇంటి దగ్గర పంపిణీ చేయడం లేదని తెలిస్తే ఆపరేటర్లపై తగు చర్యలు తీసుకుంటాం.

- భారతి, తహసీల్దారు, ప్యాపిలి

మొద్దునిద్రలో అధికార యంత్రాంగం

మండలంలో ఎండీ యూ వాహనాలు మూలన పడ్డాయన్న సంగ తి అందరి విదితమే. ప్రజలు కూడా రేషన్ వాహనాల పరిస్థితిని పలుమార్లు ఫిర్యాదు లు చేశారు. అయినా ఏనాడు అధికారులు స్పందించిన దాఖలాలు కనిపించలేదు. వాహనాల పరిస్థితి ఇంత అధ్వానంగా తయారైన పట్టించుకోకపోవడంపై అధికారుల మొద్దు నిద్రలో జోగుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బిల్లుల చెల్లింపుల మాటున ఏమో జరుగుతుందనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

తొమ్మిదినెలల్లో పూర్తి చేస్తాం

- రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ

బనగానపల్లె, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో షాదీఖానా నిర్మాణాన్ని తొమ్మిదినెలల్లో పూర్తి చేసి ముస్లింలకు కానుకగా అందిస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న షాదీఖానా భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ముస్లింలకు షాదీఖానా నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఆలోచనతో రూ. కోటి నిధులు విడుదల చేయించామన్నారు. దీనికి తోడు తాను అదనంగా రూ.30లక్షలు మేర షాదీఖానా కోసం విరాళం అందించినట్లు తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మరికొందరు కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా షాదీఖానా నిర్మాణాన్ని ముందుకు సాగనీయకుండా అడ్డుకున్నారన్నారు. షాదీఖానా నిర్మించాలని అనేక సార్లు చెప్పినా వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదన్నారు. నేడు అల్లా దయవల్ల టీడీపీ అధికారంలోకి రావడం తాను గెలవడంతో ముస్లిం మైనార్టీల రుణం తీర్చుకుంటామన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆక్రమణలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. షాదీఖానాతో పాటు కాంపౌండ్ గోడ నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు వెల్ఫేర్ అధికారి సబీహాపర్వీన్, డీఈ నాగశ్రీనివాసులు, ఈవో సతీశ్‌రడ్డి, ఏఈ రమణ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, అన్వర్‌సాహెబ్, పట్టణ అధ్యక్షుడు కాశింబాబు, పూలకలాం, రాయలసీమ సలాం ,ఇస్మాయిల్ ఖాన్, హైదర్, నియాజ్ హుసేన్, అహ్మద్‌హుసేన్, రహిమాన్, మహబూబ్ బాష, గౌండాబాబు, అమీర్‌జాన్, హర్షద్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎం సహాయ నిధి నుంచి మంజూరు అయిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.



షాదీఖానా నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ముగిసిన యాగంటీశ్వరుడి పార్వేట ఉత్సవాలు



యాగంటికి చేరుకున్న ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

బనగానపల్లె, జనవరి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రంలో ఎర్రమల్లకొండలు దిగి వచ్చిన ఉమామహేశ్వరస్వామి పార్వేట ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. బుధవారం కొండ దిగిన ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సంప్రదాయ బద్ధంగా గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఊరేగించారు. మీరాపురం, యాగంటిపల్లె, సాధుకొట్టం, మాదాసుపల్లె, పాతపాడు గ్రామాల్లో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు పార్వేట ఉత్సవాల్లో పాల్గొని పాతపాడు నుంచి యాగంటి క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ ఈవో చంద్రుడు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారులు మహేశ్, శ్రీ ఉమామహేశ్వరస్వాముల ఉత్సవ విగ్రహాలను ఉమామహేశ్వరస్వామి వారు పల్లకీ ద్వారా మంగళవాయిద్యాలతో పాతపాడునుంచి యాగంటి క్షేత్రానికి చేర్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు. పార్వేటను పాతపాడులో ఏర్పాటు చేసిన అనంతరం యథావిధిగా ఉత్సవ మూర్తులు యాగంటి క్షేత్రానికి చేరుకున్నాయి. దీంతో యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి పార్వేట ఉత్సవాలు ముగిశాయి.

ఏపీఎం, వెలుగు సీసీని తక్షణమే తొలగించాలి

- రోడ్డుపై బైఠాయించిన సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రంగాపురం వీవోఏ లక్ష్మిదేవి ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఏపీఎం మధు సుదర్శన్‌గౌడు, వెలుగు సీసీ మహేశ్వరీలను తక్షణమే సస్పెండ్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పాతబస్టాండులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మధుశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని వీవోఏలును తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో లక్ష్మీదేవితో పాటు మరో 29 మందిని వీవోఏలను తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీదేవి ఈ దారుణానికి పాల్పడేందుకు కారకులైన ఏపీఎం, వెలుగు సీసీలపై తక్షణమే కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృ తం చేస్తామని హెచ్చరించారు. సుమారు గంటకు పైగా సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు వీవోఏలు పాతబస్టాండులో రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను స్థంభింపజేశారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని విరమించుకోవాలని పోలీసులు వారికి సర్ది చెప్పా రు. తమకు న్యాయం జరిగేంత వరకు విరమించుకునేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌బాబు అక్కడకు చేరుకుని విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సర్ది చెప్పడంతో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు విరమించుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు, వీవోఏలు పాల్గొన్నారు.



పాతబస్టాండులో రోడ్డుపై బైఠాయించిన సీఐటీయూ నాయకులు

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

దొర్నిపాడు/బనగానపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనలు దొర్నిపాడు, బనగానపల్లె మండలాల్లో గురువారం చోటు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

దొర్నిపాడు మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన చిట్టిబాబు (35) వరి కోత మిషన్ పనుల నిమిత్తం గ్రామం నుంచి చాకరాజువేములకు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

యాగంటిపల్లెలో..

బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన బండి రామచంద్రారెడ్డి కుమారుడు బండి మదన్‌మోహన్ రెడ్డి (19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బండి రామచంద్రారెడ్డి కర్నూలులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతు న్నాడు. సంక్రాంతి సెలవులకు వచ్చి యాగంటిపల్లె నుంచి మాదాసుపల్లెకు బైక్ మీద వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రగాయాలకు గురయినట్లు ఎస్ఐ తెలిపారు తీవ్రంగా గాయపడ్డ మదన్‌మోహన్‌రెడ్డిని బనగానపల్లెలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఓ ప్రవేటు వైద్యశాలకు వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. విద్యార్థి మృతదేహానికి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలో పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా ..కూలీ మృతి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగందిన్నె గ్రామం వద్ద ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందారు. ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామానికి చెందిన అనూష (32) మరి కొంత మంది మహిళలతో కలిసి వరి నాట్లు వేసేందుకు ఆటోలో వెళ్తుండగా లింగందిన్నె సమీపంలో మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో అనూష అక్కడికక్కడే మృతి చెందగా మరి కొంత మంది మహిళలు గాయపడ్డారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

బేతంచెర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని పారిశ్రామికవాడ అయ్యలచెరువు ప్రాంతంలో నాపరాళ్ల ఫ్యాక్టరీలో ఉంటున్న కొట్టాల మహేశ్వరి (20) అనే వివాహిత మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు మూడేళ్ల క్రితం ఎం.పెండేకల్లు గ్రామానికి చెందిన పుట్టుక మధుసూదన్‌తో ఓర్వకల్లు మండలం తడకనపల్లెకు చెందిన కొట్టాల మహేశ్వరికి వివాహమైంది. గత నాలుగు నెలల క్రితం మహేశ్వరి కుమారుడిని ప్రసవించింది. అయితే అప్పటి నుంచి మహేశ్వరి నాలుగు నెలల కుమారునికి మూర్ఛ వ్యాధి వస్తుండటంతో వైద్యం చేయించుకున్న వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతురాలి భర్త మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

నేడు గ్రామాల్లో వైద్య బృందం పర్యటన

కోవెలకుంట్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో రూ.15వేలు పింఛను తీసుకునే లబ్ధిదారులను వైద్యబృందం పరీక్షిస్తుందని ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో రూ.15వేలు పింఛను తీసుకునే లబ్ధిదారులు మొత్తం 21 మంది ఉన్నారన్నారు. వీరికి రెండురోజులు ముందుగానే నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసులు అందుకున లబ్ధిదారులు వైద్యబృందానికి సహకరించాలని కోరారు.

దేవాలయాలను రక్షించుకోవాలి

శిరివెళ్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య అన్నారు. మండలంలోని గుండంపాడు గ్రామంలో వెలసిన వీరభద్ర స్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్తంభాలు పాతి ఫెన్సింగ్ వేసేందుకు సిద్ధపడుతున్నాడని.. దీనిపై సమగ్రంగా విచారించాలని గురువారం తహసీల్దార్ పుష్ప కుమారికి విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, కమతం రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, పార్వతీశం, చంద్ర పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సీడీ సర్వే వేగవంతం చేయాలి

చాగలమర్రి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో ఎన్‌సీడీ సీడీ సర్వే వేగవంతం చేయాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సూచించారు. గురువారం చాగలమర్రిలో జరుగుతున్న ఎన్‌సీడీ సీడీ సర్వేను పరిశీలించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రుణాల కోసం దరఖాస్తులు

చాగలమర్రి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, రెడ్డి, ఈబీసీ కులాలకు చెందిన వారు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 55 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. 1.18 కోట్లు రుణాలు మంజూరయ్యాయని అన్నారు. ఈబీసీ, రెడ్డి కులాల వారికి నాలుగు యూనిట్లకుగాను రూ.6 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. ఏపీజీబీ, ఆళ్లగడ్డ ఆంధ్రాబ్యాంకు, చాగలమర్రి, ముత్యాలపాడు ఎస్‌బీఐ బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వీటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు వితరణ

చాగలమర్రి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండు సమీపంలోగల ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు కైప సత్యనారాయణ, పార్వతమ్మ దంపతుల తనయుడు కైప చిన్నశాస్త్రీ, జయశ్రీ దంపతులు, కుమారుడు నరసింహశాస్త్రి, కుమార్తె ప్రత్యూష గురువారం రూ.2.50 లక్షలు నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు రోహిణీశ్వర్‌రెడ్డి, శేషాద్రి, దస్తగిరి, వెంకటరమణ, రాము పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవ పల్లకి ఉత్సవం



మల్లేవేములలో చెన్నకేశవ ఉత్సవమూర్తులచే ఊరేగింపు

చాగలమర్రి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామంలోని వెల్లాల క్షేత్రంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఉత్సవమూర్తుల పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో పల్లకితో ఊరేగింపు చేశారు. దేవతా మూర్తులకు గ్రామ సర్పంచ్ ఈదుల సరోజమ్మ, కార్యదర్శి నాగార్జున, జ్యోతిశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన కళాకారులచే చెక్కభజన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు సుబ్బిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, గ్రామ పెద్దలు ప్రతాప్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, స్వామిరెడ్డి, మల్లారెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ముత్యాలపాడు గ్రామంలో..

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పార్వేట సందర్భంగా గురువారం మూర్తి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులకు పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఆలయ కార్యవర్గం ఎన్నిక

చాగలమర్రి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పూర్తి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యవర్గాన్ని గురువారం డెయిరీ చైర్మన్ ఇండ్ల రమణారెడ్డి, టీడీపీ నాయకుడు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా రేడియో నరసింహుడు, సభ్యులుగా ఇండ్ల నాగేశ్వరమ్మ, నరసింహారెడ్డి, తిమ్మారెడ్డి, లింగన్న, సుబ్రహ్మణ్యం, నరసింహుడు, శీలం పుల్లయ్య, ఎన్. నాగన్న, మస్తానయ్య, పుల్లయ్య ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వాటర్ ట్యాంకు సమీపంలో మట్టి తవ్వకాలు

రుద్రవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరంగాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఓహెచ్ ఆర్ఎస్ ట్యాంకు సమీపంలో మట్టి తవ్వారు. దాంతో లక్షలు వెచ్చించి నిర్మించిన ఓహెచ్ ఆర్ఎస్‌కు ప్రమాదం పొంచి ఉంది. మట్టి అనుమతి లేకుండా తవ్వేసి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకు సమీపంలో తవ్విన దృశ్యం

కంతులు ఎలా కట్టాలి

- లారీ కంపెనీ షెడ్డు ముందు యజమానుల ధర్నా



లారీల షెడ్డు ఎదుట నిరసన తెలుపుతున్న లారీ యజమానులు

బేతంచెర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): లారీలకు వారెంటు ఉన్న మరమ్మతు చేయడం లేదని, దాంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని లారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని పారిశ్రామికవాడలోని లారీల కంపెనీ షెడ్డు ఎదుట లారీల యజమానులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణానికి చెందిన బెల్లం వర ప్రసాద్ రెడ్డికి చెందిన లారీకి వారెంటు ఉండటంతో సైలెన్సర్ మరమ్మతుల కోసం వచ్చాడు. అయితే షెడ్డులో మరమ్మతులు చేస్తామని చెప్పి 45రోజులుగా చేయలేదన్నారు. లారీ తిరుగుతూనే కంతులు కట్టుకునే అవకాశం ఉంటుందని, దాంతో లారీ యజమాని తీవ్రంగా నష్టపోయాడని వారు వాపోయారు. షెడ్డు మేనేజర్ విజయుడు సమాధానం ఇస్తూ ఈ విషయాన్ని తమ కంపెనీ ఉన్నతాధికారులకు తెలియజేస్తామని సమాధానం ఇచ్చారు.